
సాక్షి
గుంటూరు
శనివారం । 18 । జనవరి । 2025



పెన్షనర్లకు వైద్యపరీక్షలు

వినుకొండ(నూజెండ్ల): మంచానికే పరిమితమై వివిధ పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులకు శుక్రవారం వైద్యులు పరీక్షలు నిర్వహించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1818, నిజాంపట్నం కాలువకు 83 క్యూసెక్కులు వదిలారు.



కర్పూర యజ్ఞ మహోత్సవం

భట్టిప్రోలు(కొల్లూరు): అద్దేపల్లి రామనామ క్షేత్రంలో శ్రీరామ నామస్మరణ కోటి మహోత్సవాల సందర్భంగా శుక్రవారం కర్పూర యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు.

నల్లిగిపోతున్న మిర్చి రైతులు

- గణనీయంగా తగ్గిన దిగుబడులు
- ఎకరాకు రూ.లక్షకుపైగా నష్టం తప్పదంటున్న కర్షకులు
- వచ్చే దిగుబడులు పురుగుమందుల ఖర్చుకూ చాలవంటూ ఆవేదన
- మద్దతు ధర ప్రకటించడంలో సర్కారు విఫలం
- పల్నాడు జిల్లాలో 1.10 లక్షల హెక్టార్లకుపైగా మిర్చి సాగు

నట్టేట ముంచిన నల్లి, ఎర్రనల్లి తెగుళ్లు



అచ్చంపేటలో నల్లి తెగులు సోకిన మిర్చి పంట

అచ్చంపేట: మిర్చి రైతు నలిగిపోతున్నాడు. ఆరుగాలం పండించిన పంట తెగుళ్ల బారిన పడడంతో తల్లడిల్లుతున్నాడు. పల్నాడు జిల్లాలో ఈ ఏడాది 1.10 లక్షల హెక్టార్లలో మిర్చి సాగైంది. పెట్టుబడులు భారీగా పెరిగాయి. అప్పోసప్పోచేసి సాగు చేసిన రైతులు దిగుబడులపై గంపెడాశలు పెట్టుకున్నారు. ఆ ఆశలను నల్లి, ఎర్రనల్లి తెగుళ్లు ఆవిరి చేస్తున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి.

ఆ నియోజకవర్గంలో తీవ్రంగా..

జిల్లాలోని చాలా మండలాల్లో మిర్చి పంటల్లో నల్లి, ఎర్రనల్లి తెగుళ్ల ప్రభావం కనిపిస్తోంది. పెదకూరపాడు నియోజకవర్గంలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. అచ్చంపేట, క్రోసూరు, అమరావతి మండలాల్లో నల్లి, ఎర్రనల్లి సోకి పంట కుళ్లిపోతోంది. పూత పిందె కాకముందే రాలిపోతోంది. పండిన పంటలో తాలు శాతం ఎక్కువగా ఉండే అవకాశం కనిపిస్తోంది. పెదకూరపాడు నియోకవర్గంలో మొత్తం 25 వేల ఎకరాలకుపైగా మిర్చి పంట సాగు కాగా, పదివేల ఎకరాల్లో నల్లి, ఎర్ర నల్లి తెగులు సోకినట్టు తెలుస్తోంది.

దిగుబడిపై తీవ్ర ప్రభావం

తెగుళ్ల వల్ల ఈ ఏడాది దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. ఏటా ఎకరాకు సగటున 30 క్వింటాళ్లపైగా దిగుబడి వస్తుందని, ఈ ఏడాది 15 క్వింటాళ్ల నుంచి 20 క్వింటాళ్లకు మించి దిగుబడి రాదని వాపోతున్నారు. అచ్చంపేట మండలంలోని పలు గ్రామాలలో 8 క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్ల వరకే దిగుబడి వస్తున్నట్టు సమాచారం.

ధర ధమాల్

ఈ ఏడాది మార్కెట్లో మిర్చి ధర కూడా పడిపోయింది. గత ఏడాది ఇదే రోజుల్లో క్వింటా మిర్చి నాణ్యతను బట్టి రూ.18వేల నుంచి రూ.25వేల వరకు పలికింది. ఈ ఏడాది ఆర్మూర్ రకానికీ రూ.7 వేల నుంచి 8వేలకు మించి ధర లేదు. మద్దతు ధర ప్రకటించడంలోనూ సర్కారు విఫలమైంది. పురుగుమందుల ఖర్చుకు తగ్గట్టు కూడా ఆదాయం వచ్చేట్టు కనిపించడం లేదని, ప్రభుత్వం ఆదుకోవాలని లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొందరు రైతులు మిర్చి ప్రారంభ దశలోనే తెగుళ్లను చూసి భయంతో పంటను దున్నేసి మొక్కజొన్న వేసుకున్నారు.

పురుగుమందులకు భారీగా ఖర్చు

నల్లి తెగుళ్ల నివారణకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మూడు,నాలుగు రోజులకోసారి రూ.30వేల ఖరీదైన పురుగుమందులు కొట్టినా ఫలితం లేకపోతోంది. మొక్క నాటే నాటికే ఎకరాకు రూ.70వేలకు పైగా ఖర్చయిందని, ఇతర ఖర్చులూ కలుపుకుని ఎకరాకు రూ.2లక్షలకుపైగానే పెట్టుబడి అవుతోందని రైతులు చెబుతున్నారు. కౌలు రైతులకు ఎకరాకు రూ.30వేల కౌలు అదనమని, ఎకరాకు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లే ఆస్కారం ఉందని చెబుతున్నారు.



ఎర్రనల్లి సోకిన మిర్చి మొక్క

తెగుళ్ల ప్రభావం ఉంది

జిల్లాలో మిర్చి పంటపై నల్లి, ఎర్రనల్లి, నల్ల తామర తెగుళ్ల ప్రభావం ఉంది. పంట బాగానే పండింది. ధర లేకపోవడం దురదృష్టకరం. తెగుళ్లు సోకిన మండలాలను గుర్తించి రైతులకు సూచనలిస్తాం. తెగుళ్లను నివారించొచ్చు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు.

– రమణారెడ్డి, ఉద్యానశాఖాధికారి, పల్నాడు జిల్లా

మిగిలేది అప్పులే



నేను రెండు ఎకరాల్లో ఆర్మూర్ రకం మిర్చి సాగువేశా. మా ఇంటిలో అందరం కష్టపడతాం. ఎకరాకు రూ.లక్షన్నరకు పైగా ఖర్చయింది. 15 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చేట్టు లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాకు రూ.7వేలకు మించి ధర లేదు. అప్పులే మిగిలేలా ఉన్నాయి.

– మేకల జగ్గయ్య, రైతు, రుద్రవరం

పంట దున్నేశా



రెండున్నర ఎకరాల్లో రూ.70 వేలు పెట్టుబడి పెట్టి మిర్చి వేశా. ప్రారంభంలోనే నల్లి, ఎర్రనల్లి తెగుళ్లు కనిపించాయి. అంతకు మించి పెట్టుబడి పెట్టే స్తోమత లేక పంట దున్నేసి మొక్కజొన్న వేశా.

– మారేడు సాంబశివరావు, రైతు, రుద్రవరం

ఆత్మహత్యలే శరణ్యం



నేను రెండున్నర ఎకరాల్లో మిర్చి సాగు చేశా. తెగుళ్లు సోకాయి. ముడు రోజులకొకసారి రూ.30 వేలు ఖరీదు చేసే మందులు కొడుతున్నా ఫలితం లేదు. ఎకరాకు రూ.2లక్షలకుపైగా ఖర్చయ్యేటట్టు ఉంది. రైతులకు చాలా మందికి ఆత్మహత్యలే శరణ్యం. ప్రభుత్వం ఆదుకోవాలి.

– తిమ్మిశెట్టి రామారావు, రైతు, అచ్చంపేట

పరిసరాల పరిశుభ్రత కీలకం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్: పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని, ఆ మేరకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రతి నెలా మూడో శనివారం గ్రామ స్థాయి నుంచి నిర్వహించాలని తెలిపారు. ప్రతి నెలా ఒక ప్రత్యేక థీమ్‌తో 12 నెలలు కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా గ్రామ స్థాయి నుంచి కాలువలు శుభ్రం చేయడం, చెత్త తొలగించడం, మంచి నీటి ట్యాంకులకు క్లోరినేషన్, మౌలిక సదుపాయాల కల్పన, సుందరీకరణపై దృష్టి సారించడం వంటివి చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలతోపాటు ప్రైవేటు భాగస్వామ్యాన్ని కూడా పెంచాలని తెలిపారు. దీనికి సంబంధించి కార్యక్రమాల నిర్వహణకు నోడల్ అధికారులను నియమించామన్నారు. కష్టపడి అందరూ పని చేయాలని కలెక్టర్ కోరారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుకునే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభిస్తుందని ఈ సందర్భంగా చెప్పారు. అందరూ కష్టపడి పని చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ప్రొబెషనరీ డీఎస్పీల నియామకం

నగరంపాలెం: రాష్ట్రంలో పలువురు ప్రొబెషనరీ డీఎస్పీల బదిలీల్లో భాగంగా, గుంటూరు పశ్చిమ డీఎస్పీగా కె. అరవింద్‌ను, సౌత్ డీఎస్పీగా జి. బందయ్యలు నియమితులయ్యారు. గురజాల డీఎస్పీగా బీఎల్ నాగ జగదీష్‌లను నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

న్యూస్‌రీల్

న్యాయవాదులు పోలీస్ శాఖకు సహకరించాలి

నగరంపాలెం: ఇటీవల పొన్నూరు పట్టణ ఎస్‌ఐ రాజ్‌కుమార్, పొన్నూరు బార్ కౌన్సిల్ న్యాయవాది బేతాళ ప్రకాష్ రావుల మధ్య జరిగిన సంఘటన శోచనీయమని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై ఎస్‌ఐ రాజ్‌కుమార్‌ను వీఆర్‌కు పిలిపించామని, దర్యాప్తునకు డీఎస్పీని నియమించామని పేర్కొన్నారు. విచారణ నివేదిక అందిన తర్వాత ఎస్‌ఐపై తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. న్యాయవాద మిత్రులు ఈ విషయం అర్థం చేసుకోవాలని, జిల్లా పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.

విఘ్నేశ్వర స్వామికి సంకట హర చతుర్థి పూజలు



అమరావతి: ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వరస్వామి ఉపాలయంలో శుక్రవారం సంకట హర చతుర్థి పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి జగర్లపూడి శేషసాయి శర్మ విఘ్నేశ్వర స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. స్వామికి వివిధ రకాల పుష్పాలతో, గరికెతో విశేషాలంకారం చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామికి ప్రత్యేక పూజలు చేసి ఉండ్రాళ్ళను సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు కఠెవరం రైల్వే గేటు మూసివేత

తెనాలి రూరల్: విజయవాడ - చెన్నై రైలు మార్గంలో మూడో లైను నిర్మాణ పనుల్లో భాగంగా కఠెవరంలోని రైల్వే గేటును శనివారం మూసివేయనున్నట్టు రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి 12 నుంచి శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు గేటు మూసివేయనున్నట్టు చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న పోలీసు పికెట్

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు గ్రామంలో ఇటీవల చర్చి గోడ కూల్చి వేశారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతలకు భంగం కలుగకుండా గ్రామంలోని చర్చి సెంటర్‌లో ఒక ఎస్‌ఐ, 15 మంది పోలీసులతో పికెట్ ఏర్పాటు చేశామని సీఐ రవీంద్రబాబు శుక్రవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పికెట్ కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన పౌరాణిక, సాంఘిక నాటక ప్రదర్శనలు



వినుకొండ(నూజెండ్ల): సంక్రాంతి సందర్భంగా వినుకొండ మండలంలోని పెద్దకంచర్ల గ్రామంలో గ్రామీణ కళాపరిషత్, రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పౌరాణిక సాంఘిక నాటకాలు నేటితో ముగిశాయి. చింతామణి, సత్య హరిశ్చంద్ర నాటకాలతో పాటు చివరి రోజున రాజరాజ సుయోధన అనే పౌరాణిక రూపకం ప్రేక్షకులను అలరించింది. సుయోధనుడుగా ముత్తినేని గిరిబాబు, ఇతర పాత్రలో గుమ్మా శ్రీకాంత్ రెడ్డి రోటరీ క్లబ్ వారు నటన కౌశల్యంతో ప్రేక్షకులను అలరించారు. అనంతరం వివిధ పాత్రల్లో నటించిన కళాకారులను సత్కరించారు.

20 నుంచి రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

దుర్గి: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 71వ వార్షిక కల్యాణ మహోత్సవం సందర్భంగా దుర్గిలో ఈనెల 20 నుంచి 23 వరకు రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు వివరించారు. వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్
- 'శ్రద్ధ వహించండి' అనే నినాదంతో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు

నగరంపాలెం: చిన్న వాహనదారులు జాతీయ రహదారులపై ప్రయాణించేటప్పుడు సర్వీసు రోడ్లపై వెళ్లాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలో శుక్రవారం జిల్లా రవాణా, ఆరోగ్య శాఖల అధికారులతో సహకార సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వ రవాణా శాఖ ఆధ్వర్యంలో జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు 'శ్రద్ధ వహించండి' అనే నినాదంతో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు– 2025 నిర్వహిస్తోన్నట్లు తెలిపారు. హెల్మెట్ ధరించి ప్రయాణిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని అన్నారు. హెల్మెట్ వాడకంపై వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. వాయు వేగంతో వాహనాలు నడిపితే జరిగే ప్రమాదాల వలన జరిగే ప్రాణ నష్టాన్ని వారికి వివరించాలని సూచించారు. రహదారి భద్రత నియమాలు ఉల్లంఘించవద్దని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదంలో మరణాలకు కారణమైన వారు, మద్యం తాగి వాహనాలు నడిపేవారు, పెద్ద శబ్దాలతో సైలెన్సర్లను బిగించి ప్రమాదకర రీతిలో వాహనాలు నడిపే చోదకుల లైసెన్స్‌లను వాహన చట్టాల ప్రకారం మూడు నెలలు సస్పెండ్ చేస్తారని చెప్పారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని, రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘించిన వారిపై అపరాధ రుసుం విధించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు నగదు రహిత చికిత్సకు కృషి చేయాలన్నారు. రవాణా శాఖ కమిషనర్ సీతారామరెడ్డి, జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ రమణమూర్తి, జిల్లా వైద్యాధికారిణి విజయలక్ష్మి, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు అర్హత సాధించిన 263 అభ్యర్థులు

నగరంపాలెం: స్థానిక నగరంపాలెం పోలీస్ పరేడ్ మైదానంలో కానిస్టేబుళ్ల అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మైదానానికి చేరుకుని, పోలీస్ అధికారులతో మాట్లాడారు. పోటీల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీకి వివరించారు. 440 మంది అభ్యర్థులలో 83 మంది ధ్రువ పత్రాలు తేకపోవడంతో వెనుదిరిగారు. మిగతా 357 మందికి శరీర కొలత పరీక్షలు నిర్వహించగా, 42 మంది అర్హత కోల్పోయారు. మిగతా 315 మందికి 1600 మీటర్ల పరుగు పందెం పోటీలు జరగ్గా, 40 మంది అనర్హత చెందారు. 274 మందికి 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో 163 మంది అర్హత సాధించారు. 273 మందికి లాంగ్ జంప్ పోటీలు చేపట్టగా, వారిలో 263 మంది అర్హత సాధించారు. 357 మంది కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా 263 మంది అర్హత సాధించారు. జిల్లా ఏఎస్పీలు ఏవీ రమణమూర్తి(పరిపాలన), ఎ.హనుమంతు(ఏఆర్) పర్యవేక్షించారు.

దారి మళ్లిన రూ.9.24 కోట్లు

అవినీతి బయటపడుతుందనే భయాందోళనలో జీఎంసీ కమిషనర్

- సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే కౌన్సిల్ సమావేశంపై తాత్సారం
- అందుకే హడావిడిగా స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల
- ప్రజల సొమ్ము దోచుకున్నవారు ఎప్పటికైనా సభ్యులకు సమాధానం చెప్పాల్సిందే
- గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు



మీడియాతో మాట్లాడుతున్న మేయర్ కావటి మనోహర్‌నాయుడు

నెహ్రూనగర్: విజయవాడ వరద బాధితులకు సాయం పేరిట గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు రూ.9.24 కోట్ల నిధులను పక్కదారి పట్టించారని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం కౌన్సిల్ హాల్ వద్ద విలేకర్ల సమావేశంలో డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 4వ తేదీన వాయిదా పడిన కౌన్సిల్ సమావేశాన్ని తిరిగి నిర్వహించాలని కమిషనర్‌కు 8, 16వ తేదీలలో లేఖ రాసినా పట్టించుకోలేదన్నారు. కమిషనర్‌కు ఫోన్ చేసినా, కార్యాలయ అధికారిని పంపించినా స్పందించకపోవడంతో శుక్రవారం కౌన్సిల్ హాల్ వద్ద నిరసనగా ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఒక ఐఏఎస్ అధికారి అయి ఉండి రెవెన్యూ, మున్సిపల్ చట్టాలపై అవగాహన ఉండి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయకుండా అడ్డుకోవడమంటే కౌన్సిల్‌ను అపహాస్యం చేయడమేనన్నారు. అవినీతి బయటకు వస్తుందన్న భయంతో హడావిడిగా స్టాండింగ్ కమిటీ ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారని మండిపడ్డారు. ఫిబ్రవరి 3వ తేదీ వరకు సమావేశం పెట్టకుంటే తరువాత ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని, అలా సమస్య సమసిపోతుందని అనుకుంటే పొరపాటేనన్నారు. దోచుకున్న సొమ్ముకు సంబంధించి అధికారులు సమాధానం చెప్పాల్సిందేనని పేర్కొన్నారు.

అధికారుల ఖాతాలకు నగదు జమ

డిప్యూటీ మేయర్ ప్రశ్న వేస్తే అధికారులు నామమాత్రంగా సమాధానం ఇచ్చారన్నారు. అధికారులు, సిబ్బందిలో కొంత మంది సెలవుల్లో వెళ్లిపోతారు... మరి కొంతమంది అవుట్ డోర్ అంటూ వెళ్లిపోతారు. దగ్గరుండి కౌన్సిల్‌కు రాకుండా, సభ్యులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకుండా దాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నిధుల వినియోగంపై ఆరా తీస్తే ఈఈ కోటేశ్వరరావు బ్యాంకు ఖాతాకు రూ.కోటి, మరో ఈఈకి రూ.50 లక్షలు, ఇతర ఏఈలు, డీఈలకు రూ.లక్షలు వంతున మొత్తం రూ.9.24 కోట్లు కమిషనర్ చెల్లించారని పేర్కొన్నారు. రూ.9.24కోట్లు అక్రమంగా, ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉన్న డబ్బులను కనీసం కౌన్సిల్‌కు, కార్పొరేటర్‌కు, స్టాండింగ్ కమిటీ సభ్యులకు, మేయర్‌కు తెలియకుండా ఆరు రోజుల్లో ఖర్చు చేశారంటే ఆశ్చర్యంగా ఉందన్నారు. వరదల కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల నుంచి వివిధ స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంఘాలు, రాజకీయ పార్టీలు విజయవాడకు భారీ స్థాయిలో విరాళాలు, ఫుడ్, వాటర్ బాటిళ్లు, ఇతర నిత్యవసర సరుకులు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. నగర కమిషనర్ గుంటూరు నుంచి 17.50 లక్షల ఫుడ్ ప్యాకెట్లు పంపిణీ చేశామని చెప్పడం గమనించాల్సిన విషయం అని పేర్కొన్నారు.

నగరాభివృద్ధే కీలకం

కౌన్సిల్‌కు తాము వస్తున్నామని తెలిసి పోలీసు బందోబస్తు కావాలని అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కౌన్సిల్ హాల్ తమకు ఒక దేవాలయం, చర్చి, మసీదు వంటిదని చెప్పారు. గొడవలు చేయబోమని, సామరస్యంగానే సమస్య పరిష్కరించుకుంటామన్నారు. కౌన్సిల్‌లో వైఎస్సార్‌సీపీకే ఎక్కువ సభ్యులున్నారని... అందరిని కలుపుకొంటూ నగర అభివృద్ధికి ముందుకు సాగుతున్నామన్నారు. కావాలనే కమిషనర్ రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూస్తున్నట్లు ఆరోపించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, డిప్యూటీ సీఎంకు, మున్సిపల్ శాఖ మంత్రికి, క్యాట్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కౌన్సిల్ ఏర్పాటు విషయంలో న్యాయపరంగా పోరాడతామని పేర్కొన్నారు. సాయంలో నిధుల గోల్‌మాల్‌పై లెక్క తేలుస్తామని స్పష్టం చేశారు.

అడ్డగోలుగా సిబ్బంది తొలగింపు

మేయర్‌గా తనకు ప్రొటోకాల్ ప్రకారం కేటాయించిన సిబ్బందిని కనీస సమాచారం లేకుండా రాత్రికి రాత్రి వెనక్కి తీసుకున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయిన తరువాత గుంటూరు నగరానికి ప్రథమ పౌరుడినైన నాకు ఇచ్చిన గన్‌మెన్‌ను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. దీనిపై నేనెప్పుడూ బాధపడలేదు. తిరిగి సిబ్బందిని కేటాయించినా అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కౌన్సిల్ సమావేశానికి హెచ్‌ఓడీలతోపాటు ఇతర సిబ్బంది రావాలని ఎన్నిసార్లు ఆదేశించినా అందుబాటులో లేరని తెలిపారు.

ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

రేపల్లెరూరల్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో పీఎం ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగులకు వివిధ కంపెనీలు, పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు బాపట్ల జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీఎస్సీ, బీ ఫార్మసీ, బీబీఏ తదితర డిగ్రీలు చేసి 21 నుంచి 24 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఇంటర్న్‌షిప్ 12 నెలల కాలం ఉంటుందని, ఆ సమయంలో నెలకు రూ.5వేలు గౌరవవేతనం అందిస్తారని తెలిపారు. ఎంపికైన వారికి బీమా సౌకర్యం, పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన, కల్పిస్తారన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 500 కంపెనీలలో కోటి మందికి నైపుణ్యాలు కల్పించేందుకే ఈ స్కీమ్‌ను రూ.800 కోట్లతో ప్రారంభించినట్లు తెలిపారు. రెగ్యులర్ కోర్సులలో విద్యను అభ్యసించేవారు అనర్హులని, ఆన్‌లైన్, దూర విద్య కోర్సులను అభ్యసించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం ఫుల్‌టైం ఉద్యోగం చేస్తున్న వారు అనర్హులని చెప్పారు. కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ.8లక్షల కంటే ఎక్కువ ఉండరాదన్నారు. పూర్తి వివరాల కోసం 85559 01198 నంబరులో సంప్రదించాలని కోరారు.

వైభవంగా భావనారుషిస్వామి రథోత్సవం



పేరాలలో భావనారుషిస్వామి వారి రథోత్సవం

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా జరగగా శుక్రవారం రాత్రి స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహించారు. రథోత్సవ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి పేరాలలో ఊరేగించారు. రథోత్సవం సందర్భంగా వీధుల్లో బొమ్మల అంగళ్లు ఏర్పాటు చేశారు.

రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చినవారితో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆ ప్రాంతంలో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా దారి మళ్లించారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **3,400** గరిష్టం : రూ. **4,100**

మోడల్ ధర రూ. **3,700**

క్లుప్తంగా

20న నల్లపాడులో జాబ్‌మేళా

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో 20వ తేదీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బిటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విభాగాల వరకు చదువుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్స్, 18–35 సంవత్సరాల వయసు ఉన్న నిరుద్యోగ యువతి యువకులు వారి యొక్క బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

యార్డులో 47,441 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 40,178 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 47,441 బస్తాలు అమ్మకాలు నిర్వహించారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,200 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,500 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.7,500 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.7,500 నుంచి రూ.15,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 41,052 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు.

సమాజాన్ని మేల్కొలిపేవే నాటికలు

మూడో రోజు రసవత్తరంగా సాగుతున్న నాటికలు



ఏది నిజం నాటికలోని సన్నివేశం



సాంబశివరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, కళా పరిషత్ సభ్యులు

యద్దనపూడి: నాటికల్లోని పాత్రల్లో ప్రేక్షకులు తమను తాము చూసుకోవటం ద్వారా సామాజిక చైతన్యం పెరుగుతుందని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలలో భాగంగా మూడో రోజైన శుక్రవారం ప్రదర్శించిన నాటిక పోటీలు ఆద్యంతం ప్రేక్షకులను రంజింపజేశాయి. తొలుత ఎమ్మెల్యే జ్యోతిప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో టీవీ విశ్లేషకులు ఇడుపులపాటి సాంబశివరావు, తెలుగు టీవీ నిర్మాతల మండలి అధ్యక్షుడు ఆరెకట్ల ప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే పుల్లారావు మాట్లాడుతూ కళాపరిషత్‌ల ద్వారా నాటికల పోటీలు నిర్వహించి కళాకారులను అభినందిస్తూ గౌరవించడం అభినందనీయమని కొనియాడారు. ఆరెకట్ల ప్రసాద్ మాట్లాడుతూ సినిమా రంగంతో సమానంగా నాటక రంగానికి ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాటకాల ద్వారా సమాజానికి ఉపయోగపడే సందేశాత్మక అంశాలు ఎన్నో మిళితమై ఉంటాయన్నారు. స్త్రీ ఔనత్యాన్ని ఇనుమడింపజేసేలా మంచి నాటకాలు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇడుపులపాటి సాంబశివరావు మాట్లాడుతూ గతంలో గ్రామీణ ప్రాంతాల్లో టీవీలు, సినిమాలు లేని రోజుల్లో కాలక్షేపం కోసం నాటికలు ప్రదర్శించేవారని అలాంటి సమయంలో చదువుతో సంబంధం లేకుండా ఎన్నో నాటక పద్యాలను ప్రజలు అలవోకగా చెప్పేవారంటే నాటకాలపై ప్రజలకు ఉన్న మక్కువ ఎంతో తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అనంతవరం కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు, గుదే తారకరామారావు, మద్దినేని జయరామకష్ణ, పెడవల్లి శ్రీనివాసరావు, పోపూరి శివసుబ్బారావు, నిమ్మల సాంబశివరావు, పెడవల్లి వెంకటేశ్వర్లు, మండవ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంచుకుంటేనే మనుగడ..

తొలినాటికగా ఏది నిజం నాటికలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మకమైన అభివృద్ధి ఒక వైపు, దేశానికే తలమానికమైన కుటుంబ వ్యవస్థలో సంబంధ బాంధవ్యాలు, నైతిక విలువలు రోజురోజుకు క్షీణించిపోతున్న నేపథ్యంలో ఈ రెండు అంశాలు ప్రాతిపాదికన ఏది నిజమైన అభివృద్ధి ఉండాలో తెలుసుకోవాలని సందేశం ఇచ్చింది 'ఏది నిజం'. ఈ నాటికను శ్రీకారం రోటరీ కళాపరిషత్ మార్టూరు వారిచే ప్రదర్శించబడింది.

టెక్నాలజీనే మిత్రుడు, శత్రువు..

యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారిచే 'నా శత్రువు' అనే నాటికలో నేడు మనిషి మనుగడ టెక్నాలజీతో ముడిపడిపోయింది అనటంలో సందేహమే లేదు. ఎవరికి వారు సెల్‌ఫోన్‌తో బిజీగా గడుపుతూ బంధాలకు, అనుబంధాలకు దూరమై ఎవరికి వారు ఒంటరై పోతున్నారు. టెక్నాలజీని అవసరానికి మాత్రమే వాడితే దానికి మించిన మంచి మిత్రుడు మరొకరు ఉండరని అవసరం ఉన్నా లేకున్నా అదే లోకంగా భావిస్తూ వెళితే మాత్రం ఊహించని ప్రమాదాలు జీవితంలో సంభవిస్తాయని తెలియజేప్పే నాటికే నా శత్రువు.

సాయం అందించడమే జీవిత పరమార్థం..

స్నేహ ఆర్ట్స్ వింజనంపాడు వారిచే 'కొండంత అండ' నాటికలో తన చేలో పంటకు పట్టిన చీడను వదిలించుకోవటమే రైతు బాధ్యత అని, ప్రకతి బీభత్సాలకు రోధించటమే రైతు వంతని అనుకోకుండా సమాజంలో జరిగే అనేక అవకతవకలను సరిచేసుకుంటూ అనేక సమస్యలకు ఎదురొడ్డి పోరాడుతూ స్వార్థపూరిత మనస్తత్వాలను సరిచేస్తూ, తోటి మనుషులకు తోడూనీడగా ఉండటమే జీవిత పరమార్థమని నమ్మిన ఓ రైతు కథ. తన కుటుంబంతో పాటు తోటి రైతు కుటుంబాల్లో ఎదురైన అనే చిక్కుముడులను విడదీసి సమాజానికి ఓ మార్గదర్శకుడిగా నిలిచిన కొండయ్య జీవిత కథే కొండంత అండ నాటిక సారాంశం.

రైతుల ఫిర్యాదులు వేగంగా పరిష్కారానికి కృషి

ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్,



రైతులతో మాట్లాడుతున్న ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్

తాడికొండ: రైతుల ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వేగవంతంగా పరిష్కారం చేయాలని ఏపీ సీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆదేశించారు. శుక్రవారం తుళ్లూరు సీఆర్డీయే ప్రాంతీయ కార్యాలయంలో గ్రీవెన్స్ డేలో ఆయన రైతులు, రైతు కూలీల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధానికి భూములిచ్చిన రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం విధిగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డేను రైతులు ఉపయోగించుకుని తమ సమస్యలు అధికారులకు తెలియజేస్తే సత్వర పరిష్కారం ఉంటుందన్నారు. గ్రీవెన్స్‌లో మొత్తం 38 ఫిర్యాదులు రాగా భూ వ్యవహారాలకు సంబంధించి 37, ప్రణాళికా విభాగానికి సంబంధించి ఒక ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు కె.స్వర్ణమేరి, పి.పద్మావతి, జి.రవీందర్, ఏజీ చిన్నికృష్ణ, బి.సాయి శ్రీనివాస్ నాయక్, సామాజిక అభివృద్ధి విభాగం డీసీడీఓ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, పక్కన సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో వెల్‌నెస్ క్లినిక్‌ను తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుతున్న ఆధునిక జీవనశైలి, అహారపు అలవాట్ల వల్ల వయసుతో సంబంధం లేకుండా అనేక మంది ప్రజలు బీపీ, షుగర్ వ్యాధి బారిన పడుతున్నట్లు చెప్పారు. ప్రజలకు ముందస్తుగా వ్యాధులపై అవగాహన కల్పించి వ్యాధుల బారిన పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వెల్‌నెస్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ మాట్లాడుతూ ప్రతి సోమ, బుధవారం మూడో నంబరు ఓపీ గదిలో వెల్‌నెస్ క్లినిక్‌లు పనిచేస్తాయన్నారు. జీవన శైలి వల్ల ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురవుతున్నారని, బీపీ, షుగర్ లాంటి వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. సీనియర్ ఐవీఎస్ స్పెషలిస్టు, హెచ్‌డీఎస్ సభ్యుడు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ మాట్లాడుతూ ఆధునిక వైద్యాన్ని సామాన్యులకు చేరువచేయాలనే లక్ష్యంతో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం చంద్రబాబు వెల్‌నెస్ క్లినిక్‌లను ప్రతి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సమత, ఎస్‌పీఎం డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ సీతారామ, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ శైలజ, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ జోతుల మురళి పాల్గొన్నారు.

కనుల పండువగా సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కర్లపాలెం: శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెంలో సుబ్రమణ్యేశ్వరస్వామి శాంతి కల్యాణోత్సవంలో భాగంగా రెండు రోజుల నుంచి హోమాలు, విశేషపూజలు నిర్వహిస్తున్నారు. నాగమ్మతల్లి ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను, చిత్రపటాలను ఉంచి శాస్త్రోక్తంగా శాంతి కల్యాణం నిర్వహించారు. అఖండ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు విన్నకోట సురేష్, కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని విన్నకోట సురేష్ భక్తులతో కలసి ప్రారంభించారు. సురేష్ మాట్లాడుతూ సర్వమానవాళి సుఖ శాంతులతో ఆయురారోగ్యాలతో పాడి పంటలతో వర్ధిల్లాలని గ్రామస్తులందరూ స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించటం అభినందనీయమన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: మహిళ హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ సీఐ వి.మల్లికార్జునరావు శుక్రవారం తెలిపిన వివరాలు.. పట్టణంలోని ముత్తెంశెట్టిపాలెం నుంచి ఇస్లాంపేట వైపు వెళ్లే మార్గంలో మహిళ హత్య కేసులో నిందితుడిని తమిళనాడుకు చెందిన మణిగా గుర్తించారు. తెనాలిలో కొంతకాలంగా ఉంటూ రోజువారీ పనులకు వెళుతుండే మణికి ఇటీవల ఈ మహిళ పరిచయమైంది. ఈ నెల15వ తేదీ రాత్రి పొద్దుపోయాక మృతురాలితో కలసి మద్యం తాగేందుకు తూర్పు కాల్వకట్ట రోడ్డులోని ఓ మెకానిక్ షాపు వద్దకు వెళ్లారు. అక్కడ మాటా మాటా పెరగడంతో మహిళపై దాడి చేయగా ఆమె మృతి చెందింది. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాహనం ఢీకొని యువకుడు మృతి

అద్దంకి రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని బైకు మీద వెళ్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం అద్దంకి మండలంలోని చక్రాయపాలెంలో చోటుచేసుకుంది. సీఐ ఏ.సుబ్బరాజు వివరాల మేరకు.. మండలంలోని చినకొత్తపల్లి గ్రామానికి చెందిన మాగంటి గోవర్ధన్ (30) ద్విచక్రవాహనంపై అద్దంకి వైపు వస్తున్నాడు. ఈక్రమంలో అద్దంకి నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై మండలంలోని చక్రాయపాలెం గ్రామం రాగానే రహదారిపై వెనుకగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన గోవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మెరిసిన ప్రేమ్‌సాగర్



చీరాల రూరల్: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో చీరాలకు చెందిన దేవరకొండ ప్రేమ్‌సాగర్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఈనెల 15 నుంచి 18 వరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో ఆలిండియా యూనివర్సిటీస్ చాంపియన్‌షిప్ పోటీలు 2025 నిర్వహిస్తున్నారు. పోటీల్లో చీరాల సాయికాలనీకి చెందిన ప్రస్తుతం వైఎస్సార్ కడప యోగి వేమన యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న దేవరకొండ ప్రేమ్‌సాగర్ 81 కిలోల విభాగంలో పాల్గొన్నాడు. స్నాచ్‌లో 140 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 166 కిలోలు ఎత్తాడు. ఓవరాల్‌గా 306 కిలోల బరువులతో తృతీయ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఈ పోటీల్లో దేశంలోని 40 యూనివర్సిటీలకు చెందిన 200 మంది లిఫ్టర్లు పాల్గొనగా 81 కిలోల విభాగంగా మన రాష్ట్రం నుంచి ప్రేమ్‌సాగర్ ఒక్కడే పాల్గొనడం విశేషం.

అభినందనలు..

ఎంతో పట్టుదలతో కృషిచేసి తృతీయ స్థానం సాధించి మన రాష్ట్రంతో పాటు చీరాలకు పేరు ప్రతిష్టలు అందించాడు. ఆల్ ఇండియా స్థాయిలో పతకం సాధించిన తనను ఇంతగా ప్రోత్సహిస్తున్న వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరి, కోచ్ టి.దీన్నాబాబు, వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకట రామయ్య, యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ కొవ్వూరు రామసుబ్బారెడ్డికి స్పాన్సర్ షిప్ అందిస్తున్న రాధే గ్రూప్ చైర్మన్ ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, మేనేజింగ్ డైరెక్టర్ రాధేలకు పతక విజేత ప్రేమ్‌సాగర్ కృతజ్ఞతలు తెలిపాడు.

చోరీకి గురైన కారు స్వాధీనం



పెదకాకాని: చోరీకి గురైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెదకాకాని పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు ఆటోనగర్‌లోని జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా కార్ షోరూమ్‌కు ఈనెల 15వ తేదీ తెల్లవారుజామున ఒక వ్యక్తి వచ్చి సెక్యూరిటీ గార్డుతో మా కార్ మీ షోరూంలో ఉంది. ఒకసారి అర్జెంటుగా చూడాలి అని చెప్పి ట్రయిల్ నిమిత్తం కారును కిందకు దింపి సెక్యూరిటీ గార్డును బెదిరించి కారు తీసుకెళ్లాడు. సెక్యూరిటీ గార్డు సమాచారంతో కారును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసినట్లు గుర్తించి షోరూం ప్రతినిధులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు ఒక్క రోజులో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కారును గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి కారును గుర్తించిన సీఐ టీపీ నారాయణ స్వామి, ఎస్ఐ మీరాజ్, సిబ్బందికి జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రైల్వే స్టేషన్ క్యాబిన్ వద్ద దారుణ హత్య

- రాయితో కొట్టి హతమార్చినట్లు గుర్తింపు
- కేసు నమోదు చేసిన రైల్వే జీఆర్పీ పోలీసులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు


లక్ష్మీపురం: గుంటూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 50 సంవత్సరాలు కలిగిన వ్యక్తిని రాయితో మోది హత్యచేసిన ఘటన శుక్రవారం రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని క్యాబిన్ పరిసర ప్రాంతాల వద్ద చోటు చేసుకుంది. రైల్వే జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు.. రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని క్యాబిన్ పరిసర ప్రాంతాల వద్ద ఓ వ్యక్తి తలకు తీవ్రంగా గాయాలు అయి రక్తపు మడుగులో పడి ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న గుంటూరు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. సమాచారం తెలుసుకున్న క్లూస్ టీమ్ ఘటన చోటు చేసుకున్న ప్రదేశంలో పలు కీలక ఆధారాలను సేకరించారు. మృతుడు గుంటూరు రాజీవ్‌గాంధీనగర్ ప్రాంతానికి చెందిన మోడేటీ కోటేశ్వరరావు(50) గా గుర్తించారు. మృతుడు ఓ హోటల్‌లో టీ మాస్టర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. మృతుడికి భార్య ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడు నిత్యం మద్యం తాగి ఉంటాడు. కొంత కాలంగా కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ పని చేసుకుని హోటల్‌లోనే ఉంటున్నాడు. పోలీసుల విచారణలో మృతుడి తలపై రాయితో మోదడంతో మృతి చెందినట్లు గుర్తించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన వారిలో రైల్వే జీఆర్పీ డీఎస్పీ అక్కేశ్వరరావు, సీఐ జి.అంజిబాబు, ఎస్ఐలు లక్ష్మీనారాయణరెడ్డి, రమేష్, ఆర్పీఎఫ్ డీఎస్పీ శైలేష్‌కుమార్, సీఐ వీరబాబు ఉన్నారు. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరిలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కోటేశ్వరరావును హత్య చేసిన వారి కోసం జీఆర్పీ డీఎస్పీ అక్కేశ్వరరావు ప్రత్యేక బృందాలతో గాలింపులు ప్రారంభించారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం రెండో వీధిలోని శ్రీత్యాగరాజస్వామి కళావేదికపై సద్గురు శ్రీత్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు కొనసాగుతున్నాయి. శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ నిర్వహణలో జరగ్గా, మల్లెల క్రాంతి స్వరూప్(హైదరాబాద్) శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి నిర్వహించారు. గిరిరాజసుధా అనే కీర్తనతో ప్రారంభించి, త్యాగరాజ కీర్తనలను వీనుల విందుగా గానం చేశారు. వాయొలీనంపై పప్పు జ్ఞానదేవ్(చెన్నై), మృదంగంపై పి.జయభాస్కర్ (హైదరాబాద్), ఘటంపై ఎస్.హనుమంతరావు(తాడేపల్లిగూడెం) వాయిద్యాన్ని అందించారు. లఘు కచేరీలలో టివి.కృష్ణ వేణువు, సరయు వీణ, తుళ్లూరు పద్మావతి, యుక్తశ్రీ, ఎం.అన్వితమణి, బి.అంజనీదేవి కె.నాగలక్ష్మి ప్రతిభను చాటారు. కళాకారులను టి.శైలజ (యూఎస్ఏ) సన్మానించగా, ఉపాధ్యక్షులు గిరిజాశంకర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కొనసాగుతున్న తాత్కాలిక మరమ్మతులు



తాడికొండ: రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేసే ప్రక్రియ తాడికొండ మండలంలో కొనసాగుతోంది. సంక్రాంతి నాటికి మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇంకా పొన్నెకల్లు–అడ్డరోడ్డు మధ్య మరమ్మతులకు కనీస చర్యలు తీసుకోని కారణంగా ప్రయాణికులు కష్టాలు పడుతున్నారు. కంతేరు రోడ్డుకు కూడా పూర్తిస్థాయి మరమ్మతులు చేయని కారణంగా మార్జిన్లు ప్రమాదకరంగా మారి రాత్రివేళ ప్రమాదాలకు కారణమవుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాకేష్‌కు జాతీయ సాహితీ పురస్కారం

నరసరావుపేట ఈస్ట్: పట్టణానికి చెందిన సాహితీవేత్త, శ్రీశ్రీ కళావేదిక జాతీయ కార్యదర్శి గుండాల రాకేష్‌కు తెలుగు తేజం జాతీయ విశిష్ట సాహితీ పురస్కారం లభించింది. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం అండ్ వరల్డ్ పోయెట్రీ అకాడమీ, గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా రాకేష్‌ను పురస్కారానికి ఎంపిక చేశారు. విజయవాడలోని కొత్తా పూర్ణానంద్ విలాస్ కళావేదికలో ఈనెల 21న జరగనున్న సాహితీ సభలో పురస్కారం అందజేయనున్నారు. పురస్కారం క్రింద రూ.10వేలు నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో రాకేష్‌ను సత్కరించనున్నారు.ఈ మేరకు ఆయా సంస్థల నుంచి ఆహ్వానం అందినట్టు ఆయన శుక్రవారం తెలిపారు. తెలుగు భాష, సాహితీ, సాంస్కృతిక రంగాలలో చేస్తున్న కృషి, సేవలను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేశారని పేర్కొన్నారు. జాతీయ పురస్కారానికి ఎంపికైన రాకేష్‌ను పలువురు సాహితీవేత్తలు అభినందించారు. తెలుగు భాషాభివృద్ధి, సాహిత్య సేవలో తనను ప్రోత్సహిస్తున్న శ్రీశ్రీ కళావేదిక సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కన్వీనర్ కొల్లి రమాదేవి, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరిభూషణానికి రాకేష్ కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి కబడ్డీ పోటీల సెలక్షన్లు

పిడుగురాళ్ల: పట్టణంలోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం క్రీడా ప్రాంగణంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి కబడ్డీ పోటీల సెలక్షన్లు నిర్వహించనున్నట్లు జాయింట్ సెక్రటరీ దోమా నాగరాంజనేయరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే క్రీడాకారుల 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని సూచించారు. పురుషులు 85 కేజీలు, స్త్రీలు 75 కేజీలు బరువు ఉండాలని తెలిపారు. సెలక్షన్‌కు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు ఒరిజినల్, పాస్ పోర్టు సైజు ఫొటోలు ఆరు తీసుకొని ఉదయం 10 గంటలకు పట్టణంలోని మాంటిస్సోరీ స్కూల్ క్రీడా ప్రాంగణానికి రావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25వ తేదీ నుంచి 17వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లాల్లోని అంకుపాలెంలో జరిగే 71వ ఇంటర్ డిస్ట్రిక్ కబడీ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. వివరాలకు ఎం. నాగేంద్ర బాబు, సెల్ 9676271703లో సంప్రదించాలని ఆయన సూచించారు.

రైతు సమస్యలు పరిష్కారం చేయాలి

ఎన్‌హెచ్ అధికారులతో పురందేశ్వరి



వాడరేవు–పిడుగురాళ్ల ప్రధాన రహదారి మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎంపీ పురందేశ్వరి

కారంచేడు: వాడరేవు–పిడుగురాళ్ల జాతీయ రహదారి (167–ఏ) నిర్మాణ పనుల్లో రైతులకు, స్థానిక ప్రజలకు అభ్యంతరకరంగా మారిన సమస్యలను పరిష్కరించేలా నేషనల్ హైవే అథారిటీ అధికారులు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. శుక్రవారం ఆమె విజయవాడలోని ఆమె క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎన్‌హెచ్ అథారిటీ ఆర్ఓ రాజేష్‌కుమార్ సింగ్, సంజీవ్‌నాయుడులతో ఆమె చర్చించారు. కారంచేడు, పర్చూరు మండలాలకు చెందిన సుమారు 19 గ్రామాల ప్రజల సౌకర్యార్థం నిర్మాణ పనుల్లో కొంత సరళించాలని ఆమె సూచించారు. వీటిలో ప్రధానంగా పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామం వద్ద అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరారు. దీనికి తోడు కారంచేడు మండలంలోని కారంచేడు, కుంకలమర్రు ప్రాంత రైతన్నల సమస్యలను పరిష్కరించేలా అవసరమైన అండర్‌పాస్‌లను కూడా మంజూరు చేయాలని ఆమె సూచించారు. గ్రామానికి వచ్చిన పురందేశ్వరిని పై గ్రామాల ప్రజలు, రైతులు కలసి వినతిపత్రం అందించారుకొంత మంది రైతులు తమకు న్యాయం చేయాలని, అంత వరకు రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేయాలని రోడ్డుపై బైఠాయించి, టిప్పర్లను అడ్డుకున్నారు. దీంతో దిగివచ్చిన సంబంధిత నేషనల్ హైవే అథారిటీ అధికారులు కొంత మార్పులు చేయడానికి అంగీకరించినట్లు సమాచారం. వీటిలో ఉప్పుటూరు వద్ద ఒక అండర్‌పాస్ నిర్మాణం, కారంచేడు పొలాల వద్ద రైతులకు సాగునీరు ప్రవహించేలా అవసరమైన రెండు అండర్ పాస్‌ల నిర్మాణానికి ఒప్పుకున్నట్లు సమాచారం. బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన సుమారు 120 మంది రైతులకు ఇవ్వాల్సిన నష్ట పరిహారాలను త్వరగా ఇవ్వాలని పురందేశ్వరి అధికారులకు సూచించారు.

ఇటుక రాళ్లతో వ్యక్తిపై దాడి

వేమూరు: ఇటుక రాళ్లతో పోతార్లంక సుబ్రమణ్యంపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని ఎస్ఐ రవికృష్ణ తెలిపారు. పోలీసు కథనం ప్రకారం.. పోతార్లంక సుబ్రమణ్యం, అద్దేపల్లి జాన్‌వెస్లీ, అద్దేపల్లి ప్రవచన్, గోనుగుంట్ల డేవిడ్ మధ్య గతం నుంచి గొడవలు ఉన్నాయి. గురువారం రాత్రి కోగంటి గోపి ఫర్టిలైజర్ షాపు వద్ద వీరి మధ్య గొడవ జరిగింది. అద్దేపల్లి జాన్‌వెస్లీ, అద్దేపల్లి ప్రవచన్, గోనుగుంట్ల డేవిడ్‌లు ఇటుక రాళ్లతో సుబ్రమణ్యంపై దాడి చేశారు. తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు. బాధితుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



జెండర్ ఈక్వాలిటీ



ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి

ఇంటింటా లక్ష్మీకళ

ఆడపిల్ల పుడితే 'అయ్యో' అంటూ సానుభూతి చూపే వాళ్లు మన దేశంలో ఎన్నోచోట్ల కనిపిస్తారు. మధ్యప్రదేశ్‌లో ఈ ధోరణి మరీ ఎక్కువ. ఆడపిల్ల పుడితే ఆర్థికభారంగా భావించి పురిట్లోనే ప్రాణం తీసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మార్పు తేవడానికి మన తెలుగు బిడ్డ, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి 'లాడ్లీ లక్ష్మీ యోజన'తో నడుం బిగించారు. ప్రతిష్ఠాత్మకమైన 'బేటీ బచావో బేటీ పడావో' కు స్ఫూర్తిగా నిలిచిన ఈ సంక్షేమ పథకాన్ని పది హేను రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి.

కొన్ని సంవత్సరాల క్రితం...

కొందరు ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశం అయ్యారు అప్పటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్. ఆడపిల్ల పుడితే భారంగా భావించడం నుంచి భ్రూణహత్యల వరకు ఎన్నో విషయాలపై మాట్లాడారు. ఆయన మాటల్లో ఎంతో ఆవేదన కనిపించింది.

'ఈ పరిస్థితుల్లో మనం మార్పు తేవాలి' అనే పట్టుదల కనిపించింది.

'మనం మాత్రం ఏం చేయగలం సర్, ప్రజలు అలా ఆలోచిస్తున్నారు!' అని ఆ అధికారులు చేతులెత్తేస్తే కథ కంచికి వెళ్లి నట్లే. అయితే కథ అక్కడితో ముగిసి పోలేదు. అక్కడినుంచే మొదలైంది.

ముఖ్యమంత్రితో సమావేశం అయిన వారిలో ఐఏయస్ అధికారి నరహరి కూడా ఉన్నారు. ఒక సమస్యకు పది రకాల పరిష్కార మార్గాలు ఆలోచించడం ఆయన సొంతం.

'మనం ఏం చేయలేమా!'... సీఎం ఆవేదనపూరిత మాటలు నరహరి మనసులో సుడులు తిరిగాయి.



'కచ్చితంగా చేయాల్సిందే. చేయగలం కూడా' అని ఒకటికి పదిసార్లు అనుకున్నారు.

పేదింటి బిడ్డ అయిన నరహరికి పేదోళ్ల కష్టాలు తెలియనివేమీ కాదు. ఆడపిల్ల అంటే పనిగట్టుకొని వ్యతిరేకత లేకపోయినా పేదరికం వల్ల మాత్రమే 'ఆడబిడ్డ వద్దు' అనుకునే వాళ్లను ఎంతోమందిని చూశారు. ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడానికి హరియాణ, పంజాబ్... మొదలైన రాష్ట్రాల్లో ఎన్నో ప్రాంతాలు తిరిగారు. ఎన్నో కోణాలలో ఎన్నో ప్రశ్నలు వేశారు.

'మేం బతకడమే కష్టంగా ఉంది. ఇక ఆడ బిడ్డను ఎలా బతికించుకో వాలి సారు' అనే మాటలను ఎన్నో ప్రాంతాలలో విన్నారు.

వారికి ఆర్థిక భరోసా ఇస్తే సమస్యకు పరిష్కారం దొరికినట్లే కదా! అలా మొదలైందే లాడ్లీ లక్ష్మీ యోజన(గారాల కూతురు). ఇది సంక్షేమ పథకం మాత్రమే కాదు... సామాజిక మార్పు తెచ్చిన శక్తి. ఆడపిల్ల భారం అనే భావన తొలగించేందుకు వారికి ముందు ఆర్థిక భరోసా కల్పించాలి. అదే సమయంలో అమ్మాయిలను విద్యావంతులను చేయాలి... ఈ కోణంలో పథకానికి రూపకల్పన చేశారు. 'పుట్టగానే అమ్మాయిని లక్షాధికారి చేస్తాం' అని ప్రకటించారు. అయితే ఆ డబ్బు చేతికందడానికి షరతులు విధించారు. అమ్మాయి ఇంటర్ పూర్తి చేయాలి. 5వ తరగతి పూర్తి చేస్తే రూ.2000, 8వ తరగతి పూర్తి చేస్తే రూ.4000 చొప్పున ప్రతి తరగతికి బోనస్ చెల్లింపులు చేశారు. అమ్మాయికి పద్దెనిమిది ఏళ్లు వచ్చాక మాత్రమే 'లాడ్లీ లక్ష్మీ యోజన' కు సంబంధించిన డబ్బులు చెల్లించేవారు. అలా పథకం వందశాతం విజయవంతమైంది.

పేదింటి బిడ్డ

ఎంతోమంది ఆడపిల్లల జీవితాల్లో వెలుగులు నింపిన నరహరిది తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్. నిరుపేదింట జన్మించిన నరహరి కష్టపడి చదివి ఐఏఎస్ అయ్యారు. ప్రస్తుతం పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రిన్సిపల్ సెక్రటరీ హోదాలో ఉన్నారు. జన్మభూమికి ఏదైనా చేయాలనే ఆశయంతో 'ఆలయ ఫౌండేషన్' స్థాపించి స్థానికంగా విద్య, వైద్య, ఆరోగ్య సంబంధమైన సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు.

భ్రూణహత్యల నివారణకు...

'లాడ్లీ లక్ష్మీ యోజన' పథకం విజయవంతంగా అమలు చేస్తూనే మరోవైపు భ్రూణహత్యలపై దృష్టి సారించారు. ఇందుకోసం ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నర్సులు, కిందిస్థాయి సిబ్బందితో విస్తృతమైన విజిలెన్స్ నెట్‌వర్క్ ఏర్పాటు చేశారు. తప్పుదారి పట్టిన వైద్యులపై కేసులు నమోదు చేశారు. దీంతో చట్టాన్ని ఉల్లంఘించిన వైద్యులు దారికొచ్చారు.

ఆడపిల్ల పుడితే రైఫిల్ లైసెన్స్!

మధ్యప్రదేశ్‌లోని చంబల్‌లోయ ప్రాంతాల్లో కొన్ని కులాల ప్రజలు రైఫిల్‌ను సామాజిక హోదాగా భావిస్తారు. మగవారు సైకిల్ మీద తిరిగినా భుజాన తుపాకీ ఉండాల్సిందే! ఆడపిల్లలను పురిట్లోనే చంపేసేవారు కూడా ఆ ప్రాంతాల్లో ఎక్కువే. ఆ ప్రాంతాలలో 'లాడ్లీ లక్ష్మీ యోజన' అంతగా ఫలితం ఇవ్వలేదు. దీంతో ప్రతి 1000 మంది బాలురకు 400 మంది బాలికలే మిగిలారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఆయా కులాల వారితో సమావేశం నిర్వహించారు. 'ఆడపిల్లలను మీరు వద్దనుకుంటూ పోతే వారే కాదు చివరికి మీ కులాలు త్వరలోనే అంతరించి పోవడం ఖాయం' అని కులపెద్దలకు చెప్పారు. దీంతో వారిలో మార్పు వచ్చింది. అయితే తమకు తుపాకీ లైసెన్స్ లేకుండా ఉండలేమన్నారు. దీంతో ఆడపిల్ల పుడితే రైఫిల్ లైసెన్స్ అని నిబంధన విధించారు!

2007 నుంచి 50 లక్షల మంది ఆడపిల్లలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. బాలికల లింగ నిష్పత్తి 400 నుంచి 950కి పెరిగింది. 'లాడ్లీ లక్ష్మీ యోజన' ద్వారా సామాజిక ఫలాలు అందుతున్న తీరును అధ్యయనం చేసి ఎంతోమంది పీహెచ్‌డీ చేశారు.

లింగ వివక్షకు తావు లేని సమాజాన్ని కల కంటున్నారు నరహరి. అది చారిత్రక అవసరం. తక్షణ అవసరం.

– భాషబోయిన అనిల్‌కుమార్, సాక్షి ప్రతినిధి కరీంనగర్

సమాజ హితం కోసం...

ప్రకృతికి దగ్గరగా




డాక్టర్ చెన్నమనేని పద్మ



పూజా రాథోడ్

'నా బిడ్డలు ఆరోగ్యంగా జీవించడానికి వారికి నేను ఇలాంటి భూగోళాన్ని ఇస్తున్నానా?' అని ఆవేదన చెందుతోంది పూజా రాథోడ్. ప్రకృతి మనకు అన్నీ ఇచ్చింది. సహజమైన వనరులతో ప్రకృతి సిద్ధంగా జీవించడానికి మనమెందుకు సిద్ధంగా ఉండడం లేదు... అని ప్రశ్నిస్తున్నారు డాక్టర్ చెన్నమనేని పద్మ. ఇద్దరి ఆవేదనలోని అంతర్యం ఒక్కటే. భూమి చల్లగా ఉంటే మన జీవితాలు ఆనందంగా గడుస్తాయని. భూమాతకు ఎదురవుతున్న పరీక్షలకు సమాధానంగా ఇద్దరూ అనుసరిస్తున్న మార్గం ఒక్కటే. ఒకరిది రాజస్థాన్ రాష్ట్రం, మరొకరిది తెలంగాణ. పర్యావరణం పట్ల వారికి ఉన్న స్పృహ ఒకరితో మరొకరికి పరిచయం లేకపోయినా, ఆలోచనలను పంచుకోకపోయినా... వారిని ఒక దారిలో నడిపిస్తున్నది మాత్రం భూమాత గురించిన శ్రద్ధ, ఆరోగ్యకరమైన జీవనం పట్ల ఆసక్తి మాత్రమే.





పూజారాథోడ్ చిత్రకారిణి. పటం మీద బొమ్మలు చిత్రిస్తారు. డాక్టర్ పద్మ ఇంటి అలంకరణ వస్తువులు, బొమ్మలు చేస్తారు. ఇద్దరూ తమ కళకు ముడిసరుకుగా ఉపయోగిస్తున్నది ప్రకృతి ప్రసాదాలను మాత్రమే. ఎర్ర మట్టి, రంపపు పొట్టు, మొక్కజొన్న పీచు, బొగ్గు, గోరింటాకు, ఆవు పేడ, గులకరాళ్లు, పూలు, వంటల్లో ఉపయోగించే పిండి... వీటికి పూజ క్రియేటివిటీ తోడైతే అద్భుతమైన వాల్ పెయింటింగ్ తయారవుతుంది. పద్మచేతిలో ఆవు పేడ గణపతి, లక్ష్మీదేవి రూపాలవుతుంది. పూజా రాథోడ్... జైపూర్‌లోని ఐఐఎస్‌యూలో విజువల్ ఆర్ట్స్‌లో కోర్సు చేసి, 'స్టూడియో ద సాయిల్' పేరుతో ఆర్ట్ స్టూడియో స్థాపించింది. డాక్టర్ చెన్నమనేని పద్మ... హైదరాబాద్‌లోని వనిత మహావిద్యాలయలో తెలుగు ప్రొఫెసర్‌గా రిటైరయ్యారు. తన విద్యార్థులకు ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను గమనించిన తర్వాత వాటి పరిష్కారం కోసం చేసిన అన్వేషణ ఇలా సహజ జీవనశైలి, జీవనశైలిలో ఆవు పాత్ర తెలిసి వచ్చాయంటున్నారు. ఒక మనిషి నిద్ర లేచిన తర్వాత పళ్లు తోముకోవడం నుంచి రాత్రి పడుకునే ముందు దోమలను పారదోలడానికి ఉపయోగించే మస్కిటో కాయిల్ వరకు రోజు మొత్తంలో ఉపయోగించే అనేక వస్తువులను గోమయం, గోమూత్రంతో తయారు చేసి చూపిస్తున్నారు. వాటి తయారీలో శిక్షణనిస్తున్నారు. ఫ్లోర్ క్లీనింగ్ లిక్విడ్, హ్యాండ్ మేడ్ సోప్స్, కీ హోల్డర్స్, ధూప్ స్టిక్స్, జపమాల, వాకిలి తోరణాలు... ఇలా రకరకాల వస్తువులు తయారు చేస్తోందామె. సస్టెయినబుల్ లైఫ్ స్టైల్ పట్ల సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి తన రిటైర్‌మెంట్ జీవితాన్ని అంకితం చేసినట్లు చెప్పారు పద్మ. ఆవును బతికించుకుంటే క్యాన్సర్ రహిత సమాజాన్ని సాధించవచ్చని నిరూపించాలనేది ఆమె ఆశయం. ఇందుకు ఆవును పెంచుకోమని బోధించడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించిన తర్వాత స్వయంగా రెండు వందల గోవుల సంరక్షణ బాధ్యతను స్వీకరించారు. అందుకోసం హైదరాబాద్ నగరాన్ని వదిలి జగిత్యాల జిల్లాలోని సొంతూరు బోర్నపల్లికి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు పద్మ. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం తన గ్రామం నుంచే మొదలుపెట్టారు.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

సహజ సిద్ధంగా...

ఆవు తనకు చేతులెత్తి మొక్కమని చెప్పదు. తనను ఉపయోగించుకుని ఆరోగ్యంగా జీవించమని కోరుతుంది. అందుకే ఆవును అమ్మతో సమానం అని చెబుతారు. ఆవుతో వచ్చే ఆరోగ్యం గురించి చెప్పడానికి మాటలు చాలవు. ఆవును ఎన్ని రకాలుగా మన దైనందిన జీవితంలో భాగం చేసుకోవచ్చో తెలియచేయడానికి నెలకు ఐదువందల రూపాయలకు ఒక కిట్ తయారు చేశాను. అందులో ఇంటిని శుభ్రం చేసుకునే క్లీనింగ్ మెటీరియల్ నుంచి దేహాన్ని శుభ్రం చేసుకునే వస్తువుల వరకు అన్నీ ఉన్నాయి. రసాయన రహితమైన, ప్రకృతి సహజమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం కోసం నా ప్రయత్నం కొనసాగుతోంది. క్యాన్సర్‌ను దూరంగా ఉంచాలంటే మనం ప్రకృతికి దగ్గరగా జీవించాలి. నేలను భద్రంగా ఉంచుకోవాలి. రసాయనాలతో నేల కాలుష్యం, నీరు కాలుష్యం కావడంతో మన దేహమూ కాలుష్య కాసారమవుతోంది. క్యాన్సర్‌కు ఆహ్వానం పలుకుతోంది. ఈ దుస్థితి నుంచి మనం బయటపడాలి.

– డాక్టర్ చెన్నమనేని పద్మ, విశ్రాంత ఆచార్యులు, సామాజిక కార్యకర్త









● నగధగలు

ఇంట్లోనే ఇలా మెరిపిద్దాం!



ఆభరణాలను ధరించే కొద్దీ మెరుపు తగ్గిపోతాయని అపోహ పడుతుంటాం. కానీ వాటి మెరుపు ఎక్కడికీ పోదు. రోజూ ధరించే బంగారు ఆభరణాలు గాలి, దుమ్ము, ధూళి, వాయు కాలుష్యం కారణంగా మసకబారుతుంటాయి. వాటికి మెరుగు పెట్టించాలనుకుని దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. నెలకోసారి ఇంట్లోనే శుభ్రం చేసుకోవచ్చు.

- ఒక పాత్ర (మెటల్ పాత్ర వాడరాదు, ప్లాస్టిక్ పాత్ర వాడాలి)లో డిష్ వాష్ లిక్విడ్ నాలుగు చుక్కలు వేసి గోరువెచ్చని నీటిని పోసి కలపాలి. ఆ తరవాత ఆభరణాలను నీటిలో మునిగేలా ఉంచి 15 నిమిషాల తర్వాత చేత్తో రుద్ది కడగాలి. ఆ తర్వాత మంచినీటి పాత్రలో పెట్టి వేళ్లతో మృదువుగా రుద్దుతూ సబ్బు వదిలేటట్లు శుభ్రం చేయాలి.
- నీటితో శుభ్రం చేసిన తర్వాత పేపర్‌తో తుడిచే ప్రయత్నం చేయరాదు. మెత్తటి కాటన్ వస్త్రాన్ని ఒత్తుగా నాలుగు మడతలు వేసి ఆభరణాన్ని ఉంచాలి. శుభ్రం చేసిన ఆభరణాన్ని బీరువాలో పెట్టాలంటే ఆభరణంలో ఏ మాత్రం తేమ లేకుండా ఆరిన తర్వాత మాత్రమే భద్రపరచాలి.
- ఆభరణాలను శుభ్రం చేసేటప్పుడు పాటించాల్సిన నియమం ఏమిటంటే... ఒక్కొక్క ఆభరణాన్ని విడిగా శుభ్రం చేయాలి. చెవికమ్మలు, రింగుల వంటి వాటిని కలిపి నానబెట్టి శుభ్రం చేసే అలవాటు చాలామందికి ఉంటుంది. కలిపి ఒకే పాత్రలో నానబెట్టాల్సి వస్తే అడుగు వెడల్పుగా ఉండి ఒక కమ్మ మరొక కమ్మకు తగలకుండా జాగ్రత్త తీసుకోవాలి. అలాగే కడిగేటప్పుడు కూడా ఒకదానికి మరొకటి తగులుతూ ఉంటే గీతలు పడతాయి.
- రాళ్లు పొదిగిన బంగారు ఆభరణాన్ని శుభ్రం చేయాలంటే నీటిలో నానబెట్టరాదు. మొదట సబ్బు నీటితో ముంచిన మెత్తని వస్త్రంతో ఆభరణాన్ని తుడవాలి. ఆ తర్వాత మంచినీటిలో ముంచిన క్లాత్‌తో తుడవాలి. తుడిచిన తర్వాత మెత్తటి టవల్ మీద ఆభరణాన్ని తలకిందులుగా (ఈ స్థితిలో ఆభరణంలో పొదిగిన రాయి కిందగా టవల్‌ను తాకుతూ ఉంటుంది. బంగారు పైకి కనిపిస్తుంటుంది) ఆరబెట్టాలి. ఇలా ఆరబెట్టడం వల్ల రాయికి బంగారానికి మధ్య తేమ చేరకుండా ఉంటుంది.



జియా నస్రీన్
జెమాలజిస్ట్

సోషల్ మీడియా

బామ్మ కోసం... ఫ్లయింగ్ ఫ్రమ్ దుబాయి!



బామ్మతో జైనబ్ రోష్నా

జైనబ్ రోష్నా దుబాయిలో ఉంటుందన్న మాటేగానీ కేరళలోని బామ్మ జ్ఞాపకాలు ఎప్పుడూ తనతోనే ఉంటాయి. ఆ జ్ఞాపకాలు హాయిగా ఉంటాయి, నవ్విస్తాయి. కొన్నిసార్లు భావోద్వేగానికి గురి చేస్తాయి. తనకు తీరిక దొరికినప్పుడల్లా బామ్మతో ఫోన్‌లో మాట్లాడుతుంది జైనబ్.

'ఇలా ఫోన్‌లో మాట్లాడుకోవడమేనా! నన్ను చూడడానికి ఎప్పుడు వస్తావు?' అని అడుగుతుంది బామ్మ.

'నువ్వు దూరంగా ఉంటే కదా రావడానికి. నువ్వు ఎప్పుడూ నా కళ్ల ముందే ఉంటావు' అని నవ్వుతుంది జైనబ్.

'నీ మాటలకేంగానీ... నువ్వు నన్ను చూడడానికి రావాల్సిందే' అన్నది బామ్మ.

అటు నుంచి నవ్వు మాత్రమే వినిపించింది!

కట్ చేస్తే...

ఆ రోజు బామ్మగారి బర్త్‌డే. తన ఊళ్లో ఆ రోజు కూడా బామ్మ అన్ని రోజులలాగే ఎప్పటిలాగే ఉంది. 'నా బర్త్‌డేను జైనబ్ ఎంత ఘనంగా చేసేదో' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది.

ఇంతలో ఎవరో వస్తున్న అలికిడి వినిపించింది.

ఎవరా అని చూస్తే... ఊహించని వ్యక్తి.

'నిజమా? భ్రమా!' అనుకుంటుండగానే సంతోషంగా అరిచింది జైనబ్.

స్వీట్ షాక్ నుంచి తేరుకున్న తరువాత...

'నన్ను చూడడానికి వచ్చావా తల్లీ... ఒక్క మాటైనా చెప్పలేదు...' అంటూ సంతోషంతో కళ్ల నీళ్ల పెట్టుకుంది బామ్మ.

'ముందే చెబితే ఏం మజా ఉంటుంది! ఇలా వస్తేనే సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది' అన్నది జైనబ్.

ఆ రోజు వంద పండగలు ఒకేసారి వచ్చినంత సంతోషంగా ఫీల్ అయింది బామ్మ. ప్రేమగా, గారాబంగా మనవరాలిని ముద్దు పెట్టుకుంది.

'గత ఏడాది మా అమ్మమ్మ పుట్టిన రోజున నా ఎమిరేట్స్ యూనిఫాం ధరించి వీడియో కాల్ చేశాను. నన్ను యూనిఫాంలో చూసి అమ్మమ్మ ఆశ్చర్యపడింది. కొత్త అమ్మాయిని చూసినట్లుగా ఉంది అని నవ్వింది. ఈ పుట్టిన రోజుకు మరింత సర్‌ప్రైజ్ ఇవ్వాలనుకున్నాను. అందుకే చెప్పకుండా వచ్చాను' అని ఇన్‌స్టా పోస్ట్‌లో రాసింది జైనబ్.

ఒక్క మాటలో చెప్పాలంటే... ఇది మామూలు సంఘటన. అయితే సోషల్ మీడియాలో బామ్మ, మనవరాళ్ల వీడియో ఎంతో సందడి చేస్తోంది. దుబాయి నుంచి వచ్చిన జైనబ్ బామ్మ గదిలోకి సంతోషంగా పరుగెత్తుతున్న దృశ్యాలు నెటిజనులను ఆకట్టుకున్నాయి.

జైనబ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో క్లిప్ 2.3 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.

ఈ వీడియో క్లిప్ నేపథ్యంలో అమ్మమ్మ, నానమ్మలతో తమకు ఉన్న విలువైన జ్ఞాపకాలు పంచుకున్నారు నెటిజనులు.

'అమ్మ దగ్గర కంటే అమ్మమ్మ దగ్గరే నాకు చనువు ఎక్కువ. ఈ వీడియో క్లిప్ చూసినప్పుడు మా అమ్మమ్మ గుర్తుకు వచ్చి కళ్లలో నీళ్లు తిరిగాయి. పెద్దవాళ్లు మన నుంచి ఏమీ కోరుకోరు. మనం వారికి ఒకసారి కనిపించినా పెద్ద బహుమతిగా ఫీలవుతారు' అని స్నేహ అనే నెటిజన్ తన కామెంట్ పోస్ట్ చేసింది.

సోషల్ మీడియాలో ఈ బామ్మ, మనవరాళ్ల వీడియో ఎంతో సందడి చేస్తోంది. దుబాయి నుంచి వచ్చిన జైనబ్ బామ్మ గదిలోకి సంతోషంగా పరుగెత్తుతున్న దృశ్యాలు నెటిజనులను ఆకట్టుకున్నాయి. జైనబ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో క్లిప్ 2.3 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.

వంటిల్లు

హెల్దీ లంచ్ బాక్స్

స్కూలుకెళ్లే పిల్లలున్న ఇంటి కళ వేరు. డ్రాయింగ్ రూమ్‌లో స్కూలు బ్యాగ్‌లు. వంటగదిలో లంచ్ బాక్సులు పలకరిస్తాయి. ఆ వంటింటి మెనూ భిన్నంగా ఉంటుంది. రోజూ కొత్తగా వండాలి... హెల్దీగా ఉండాలి. ఆ తల్లికి వంట రోజూ ఓ మేధోమథనమే. వారంలో ఓ రోజు ఇలా ట్రై చేయండి.

పనీర్ బటర్ మసాలా



కావలసినవి: పనీర్ ముక్కలు– ఒకటిన్నర కప్పు; **ఉల్లిపాయ ముక్కలు** – ముప్పావు కప్పు; **టొమాటో ముక్కలు**– కప్పు; **వెల్లుల్లి రేకలు**– 4; **అల్లం తురుము** – టీ స్పూన్; **పచ్చిమిర్చి**– 2; **జీడిపప్పు**– పది పలుకులు; **పాలు**– అర కప్పు; **మీగడ** – పావు కప్పు; **కసూరీ మేథీ లేదా తాజా మెంతి ఆకు** – టీ స్పూన్; **ధనియాల పొడి**– టీ స్పూన్; **మిరప్పొడి**– టీ స్పూన్; **పసుపు** – పావు టీ స్పూన్; **వెన్న** – 2 టీ స్పూన్‌లు; **ఉప్పు** – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; **కొత్తిమీర తరుగు**– 3 టేబుల్ స్పూన్‌లు.

పోపు కోసం... నూనె – టేబుల్ స్పూన్; **యాలకులు** – 2; **లవంగం** – 1; **దాల్చిన చెక్క** – అంగుళం ముక్క;

తయారీ: ● పనీర్ ముక్కలను వేడి నీటిలో వేసి మెత్తబడే వరకు పక్కన ఉంచాలి. ● బాణలిలో నూనె వేడి చేసి మీగడ, వెల్లుల్లి, అల్లం, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, జీడిపప్పు వేసి ఒక మోస్తరుగా వేయించాలి. వీటిని ఒక ప్లేట్‌లోకి తీసుకుని అదే బాణలిలో మిగిలిన నూనెలో లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క వేయించాలి. ఆ తర్వాత మిరప్పొడి, ధనియాల పొడి, పసుపు, మేథీ వేసి పచ్చిదనం పోయే వరకు వేయించాలి. ● ఉల్లిపాయ, టొమాటో ముక్కలు, జీడిపప్పు చల్లారిన తర్వాత మిక్సీలో గ్రైండ్ చేసి ఆ మిశ్రమాన్ని బాణలిలో వేయాలి. అందులో పాలు పోసి, ఉప్పు వేసి కలిపి చిక్కదనం, రుచి చూసుకోవాలి. మిశ్రమం ఉడకడం మొదలై బుడగలు రావడం మొదలైన తర్వాత పనీర్ ముక్కలను నీటిలో నుంచి తీసి బాణలిలో వేసి కలపాలి. మంట తగ్గించి, వెన్న వేసి, కొత్తిమీర చల్లి స్టవ్ ఆపేయాలి.

పీస్ పులావ్



కావలసినవి: బాసుమతి బియ్యం – కప్పు; **పచ్చి బఠాణీ**– పావు కప్పు; **నీరు** – 3 కప్పులు; **బిర్యానీ ఆకు** – ఒకటి; **యాలక్కాయ** – 1; **లవంగం** – 1; **దాల్చిన చెక్క** – అర అంగుళం ముక్క; **ఉప్పు** – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; **నిమ్మరసం** – అర టీ స్పూన్.

పోపు కోసం... నెయ్యి– 2 టేబుల్ స్పూన్‌లు; **పచ్చిమిర్చి**– 1 (నిలువుగా చీరాలి); **షాజీరా**– టీ స్పూన్.

తయారీ: ● బియ్యాన్ని కడిగి పది నిమిషాల సేపు మంచినీటిలో నానబెట్టాలి. బఠాణీలను కడిగి పక్కన పెట్టాలి. ● నీటిని ఒక పాత్రలో మరిగించాలి. నీరు మరగడం మొదలైన తర్వాత అందులో బఠాణీలు, బియ్యం వేయాలి. బియ్యం ఉడికేటప్పుడే నిమ్మరసం, యాలక్కాయ, లవంగం, దాల్చిన చెక్క, బిర్యానీ ఆకు, ఉప్పు వేయాలి. అన్నం ఉడుకుతున్నప్పుడే మరో స్టవ్ మీద ఒక పాత్ర పెట్టి అందులో నెయ్యి వేడి చేసి పచ్చిమిర్చి, షాజీరా వేసి వేగిన తర్వాత ఉడుకుతున్న అన్నంలో వేసి అన్నం మెతుకులు విరగకుండా జాగ్రత్తగా కలిపి మూత పెట్టాలి. మంట తగ్గించి నీరు ఇంకి పోయిన తర్వాత దించేయాలి.

గమనిక: ఎండు బఠాణీలైతే రాత్రంతా నానబెట్టాలి.